క్లుప్తంగా

2న యోగా వర్క్‌షాప్

రాజానగరం: కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో జూలై 2న యోగా వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను ముందుగా నమోదు చేయించుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు 73823 08440, 83098 27229 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా జగనన్న సురక్ష


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న దృశ్యం

రాజానగరం: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని తహసీల్దార్ పవన్ కుమార్ తెలిపారు. మండలంలోని నందరాడలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు అడుసుమిల్లి ఉదయ్‌తో కలిసి గురువారం ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

రేపటి నుంచి 'జగనన్న సురక్ష' గ్రామసభలు

రంగంపేట: మండలంలో జూలై 1 నుంచి 25 వరకూ జగనన్న సురక్షపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు గురువారం తెలిపారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాలు లేదా సచివాలయాల వద్ద జరిగే ఈ సభలకు టీమ్–ఏ నుంచి తహసీల్దార్ ఎం.దొరకయ్య, ఈఓపీఆర్డీ ఎస్.కాత్యాయనీ, ఏఎస్ఓ కె.స్వాతి, టీమ్–2 నుంచి ఎంపీడీఓ బి.శ్రీరామరాజు, ఆర్ఐ కె.విశ్వతేజ, ఏపీఓ జి.వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు. జగనన్న సురక్షలో గ్రామస్తులకు అందించే సేవలను తెలియజేసి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. దీనికి ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సహకరించి విజయవంతం చేయాలన్నారు.

యాత్ర విజయవంతానికి పిలుపు

రంగంపేట: వడిశలేరులో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే భవిష్యత్తుకు గ్యారంటీ జనచైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం వడిశలేరులో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు ఆధ్వర్యంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎస్సైగా చిరంజీవి

సీతానగరం: ఎస్సైగా కె.చిరంజీవి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన అంబేడ్కర్ కోనసీమ జిల్లా పామర్రు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

స్పోర్ట్స్ కోటాలో నన్నయ విద్యార్థికి ఉద్యోగం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఏలూరులోని కేఏహెచ్ఎల్ డిగ్రీ కళాశాల బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి చిన్ని విజయ్‌కుమార్ రైల్వేలో కమర్షియల్ కమ్ టిక్కెట్ క్లర్క్ ఉద్యోగాన్ని స్పోర్ట్సు కోటాలో సాధించాడు. ఈ విషయాన్ని యూనివర్సిటీ స్పోర్ట్సు సెక్రటరీ రామ్‌గోపాల్ గురువారం తెలిపారు. విజయ్‌కుమార్ చండీఘర్ యూనివర్సిటీలో 2022లో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో వెయిట్ లిఫ్టింగ్‌లో తృతీయ, బెంగళూరులో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ద్వితీయ స్థానాన్ని పొందాడు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ ద్వారా రైల్వే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడంతో పై ఉద్యోగానికి ఎంపికై, ఈనెల 22న ముంబైలో ఉద్యోగంలో చేరాడు.

16న విద్యాపరిరక్షణ సదస్సు

సీటీఆర్ఐ: పేదలకు ప్రభుత్వ విద్య దూరం కాకూడదనే సదాశయంతో జూలై 16న రాష్ట్ర స్థాయి విద్యాపరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఆనం రోటరీ హాలులో జరిగే సదస్సుకు ప్రధాన వక్తగా ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ సమితి కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్ హాజరవుతారన్నారు. సదస్సులో పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. సంఘం వైస్ చైర్మన్ ఎంవీ ప్రసాద్, గౌరవాధ్యక్షుడు, కేకే సంజీవరావు, జిల్లా అధ్యక్షుడు డి.జార్జి ఆంటోని పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ధవళేశ్వరం: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ధవళేశ్వరం మార్కెట్ వ్యాపారుల వినతి మేరకు గురువారం ఆయన మార్కెట్ ఏరియా, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయించాలని, పాడుబడిన షాపులను పరిశీలించి మరమ్మతుల కోసం నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు తలారి వరప్రసాద్, పందెల్ల భానుప్రసాద్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆదమరిస్తే అపాయమే..

- ప్రమాదకరంగా ఏటిగట్టు
- బెర్ములు లేక వాహనచోదకుల అవస్థలు


వంగలపూడి వద్ద బెర్ములు లేని రోడ్డు

సీతానగరం: ఏటిగట్టు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకూ 15 కిలోమీటర్లు ఉన్న ఏటిగట్టు రోడ్డుకు బెర్ములు లేకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దాదాపు 20 అడుగులకు పైగా ఎత్తున్న ఏటిగట్టు నుంచి వాహనాలు కిందకు పడిపోతున్నాయి. సింగవరం, వంగలపూడి, చినవంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం గ్రామాల వద్ద ఏటిగట్టు తారురోడ్డుకు గ్రామాల వైపున మార్జిన్ లేదు. ఎదురుగా మరో వాహనం వస్తే రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. ఇదే రహదారిపై లారీలు, పాపికొండల పర్యాటకులను తరలించే బస్సులు, కార్లు, ఆటోలు, పోలవరం ప్రాజెక్టుకు అవసరమైయ్యే పరికరాలను తరలించే భారీ వాహనాలు వెళుతుంటాయి. పలు లారీలు గతంలో వంగలపూడి ఏటిగట్టుపై నుండి కిందకు బోల్తా కొట్టాయి. ఏటిగట్టును ఆనుకుని పలు నివాస గృహాలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

తప్పుకోవడానికి వీలు లేక..

మార్జిన్ లేని ప్రాంతంలోకి భారీ వాహనాలు వస్తే ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి వీలు లేకుండా ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవాలంటే, ఒక వాహనం వెనక్కి వెళ్లాల్సిందే. వంగలపూడి, సింగవరం గ్రామాల వద్ద, అలాగే వంగలపూడి – రామచంద్రంపురం మధ్య ఏటిగట్టు తీవ్రమైన మలుపులు ఉన్నాయి. ఇటుగా పాపికొండలకు పర్యాటకులను తరలించే వాహనాలు నిత్యం అధిక సంఖ్యలో వస్తున్నాయి. పుష్కరాలకు రోడ్డు వేసినా మార్జిన్లపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఈ మలుపుల వద్ద అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



రోడ్డుకు మార్జిన్ లేకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు ఎదురుపడితే తప్పుకోవడానికి జాగా లేదు. గత ప్రభుత్వాలు రోడ్డు వేసినా మార్జిన్ ఏర్పాటుపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కొంచ భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ, చిన వంగలపూడి

మార్జిన్ వేయాలి



హైదరాబాద్ నుంచి కారులో వచ్చాను. రోడ్డుకు బెర్ములు లేకపోవడంతో ఎదురుగావచ్చే వాహనాలతో కారు నడపడానికే భయపడ్డాను. భారీ వాహనాలు ఎదురుపడితే తప్పుకోవడానికి వీలు లేదు. రోడ్డుకు మార్జిన్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– పలివెల విజయ్ కుమార్

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి


రామేశ్వరంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామేశ్వరంలో గడప గడపకూ..

పెదపూడి: పేదరికమే ప్రామాణికంగా తీసుకుని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్నే తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం రామేశ్వరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏ గడపకు వెళ్లినా మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే తమ కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రజలు చెబుతున్నారని అన్నారు. జగనన్నే తమ కుటుంబాలకు ధైర్యం, పిల్లల భవిష్యత్‌కు భరోసా, రాష్ట్రాభివృద్ధికి దిక్సూచి అని ఆనందంతో కొనియాడుతున్నారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణయుగం వచ్చిందన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, సర్పంచ్ కొటికలపూడి చినబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

సీతానగరం: రఘుదేవపురం పంచాయతీ రవీంద్ర కాలనీ వద్ద రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు కార్యక్రమం ఆ శాఖ ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతోంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు నుంచి సీతానగరం వరకూ ఆర్ అండ్‌బీ రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ స్తంభాలు రోడ్డు పనులకు అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించి, రెండు మీటర్లు దూరంలో వేస్తున్నారు.

నేత్రదానంపై చైతన్యవంతులు కావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఐ బ్యాంక్ వాహనం ప్రారంభం


ఐ బ్యాంక్ వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మరణించిన తరువాత కూడా ప్రపంచాన్ని చూడగలిగే మహత్తర అవకాశం నేత్రదానంతో కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. స్థానిక తేతలి రామిరెడ్డి మంగాయమ్మ ఐ బ్యాంక్‌కు విశాఖపట్టణానికి చెందిన దేవి సీఫుడ్స్ సౌజన్యంతో కొనుగోలు చేసిన ఐ బ్యాంక్ వాహనాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటిచూపు లేకపోతే ఆ వ్యక్తి జీవితం అంధకారంగా మారుతుందని అన్నారు. కార్నియా సంబంధిత లోపాలతో అనేక మంది కంటి చూపునకు దూరమవుతున్నారని తెలిపారు. నేత్రదానంపై సమాజంలో అవగాహన లేకపోవడం శాపంగా మారుతోందన్నారు. నేత్రదానంతో మనిషి మరణించిన తరువాత కూడా మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. నేత్రదానం ఆవశ్యకత, విశిష్టతను సమాజంలో ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నేత్రదానం చేయడంతో పాటు మరింత మందిని ప్రోత్సహించాలని కోరారు. దాతలు స్థానిక రాధాకృష్ణ ఐ బ్యాంక్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ తేతలి రాధాకృష్ణారెడ్డి, కార్యదర్శి తేతలి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు


అనపర్తి పాతవూరు విష్ణాలయంలో జనార్దనస్వామి, అమ్మవార్లు


బిక్కవోలులో లక్ష్మీనారాయణ స్వామివారు


సంపరలో వేంకటేశ్వర స్వామివారు


కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాజానగరం: తొలి ఏకాదశి సందర్భంగా నియోజకవర్గంలో వైష్ణవాలయాలు గురువారం భక్తులతో కళకళలాడాయి. మండలంలోని ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ, తుంగపాడు, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం, దివాన్ చెరువు, వెలుగుబంద, నరేంద్రపురం, తూర్పుగోనుగూడెం, పాలచర్లలోని రామాలయం, కృష్ణాలయం, వేంకటేశ్వరస్వామి, నరసింహస్వామి ఆలయాలలో భజన, సంకీర్తనలతో ఆయా ప్రాంతాలలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అలాగే గురువారం కావడంతో సాయిబాబా ఆలయాలలో కూడా తొలి ఏకాదశి సందడి కనిపించింది. స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయిభక్త మండలి ఆధ్వర్యంలో గురు చరిత్ర పారాయణ జరిగింది. మధ్యాహ్నం హారతి అనంతరం అన్నసమారాధన చేశారు.

3న గురుపూర్ణిమ

స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపూర్ణిమ వేడుకలు జరగనున్నాయి. వేకువజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఆలయంలోని దత్తాత్రేయుడు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయిభక్త మండలి ఆధ్వర్యంలో గురు చరిత్ర పారాయణ చేస్తారు. తదుపరి ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ వచ్చే గురువారం నుంచి వరుసగా 11 గురువారాలు గురు చరిత్రను పారాయణ చేస్తారు. ఆసక్తి ఉన్న భక్తులు ఎవరైనా ఈ పారాయణలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. పారాయణలో పాల్గొన్న భక్తులకు ఆఖరి వారంలో సాయి సచ్చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేస్తారు.

అనపర్తిలో..

అనపర్తి: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం మండలంలోని వైష్ణవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పాతవూరులోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి, కెనాల్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయం, మండలంలోని వివిధ ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, సహస్ర తులసి పూజలు చేశారు.

బిక్కవోలు: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బిక్కవోలు లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పందలపాక వెలంపేట రామాలయం వద్ద భజనలు నిర్వహించారు. బలభద్రపురం ఆంధ్రా షిర్డీ సాయి ఆలయం, బిక్కవోలు సాయిబాబా ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. అనంతరం బాబాకు హారతులు ఇచ్చారు.

పెదపూడి: జి.మామిడాడలోని సూర్యనారాయణ మూర్తి ఆలయం, ఇతర ఆలయాల్లో ఉదయం నుంచి తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సంపరలోని వేంకటేశ్వర స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు పంచామృతాభిషేకాలు, తులసి, కుంకుమ పూజలు చేశారు.

మధురపూడి: కోరుకొండ మండలంలోని దేవాలయాల్లో గురువారం తొలి ఏకాదశి సందడి నెలకొంది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాలకు భక్తుల రద్దీ ఏర్పడింది. ప్రలువురు బూరుగుపూడి, కోరుకొండ బాబా ఆలయాల్లో భక్తుల రద్దీ ఏర్పడింది.

సీతానగరం మండలంలో..

సీతానగరం: గ్రామంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, శివాలయం, రఘుదేవపురంలోని సాయిబాబా, శివకేశవుల ఆలయాలు, ముగ్గళ్ల శివాలయం, ఇనుగంటివారిపేటలో సాయి బాబా ఆలయాలకు భక్తులు తరలివచ్చారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్


పందలపాకలో బక్రీద్ విశిష్టతను తెలుపుతున్న ఇమామ్ రిజ్వి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు, పందలపాక, బలభద్రపురంలోని మసీదుల్లో గురువారం త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పందలపాక అహలె సున్నత్‌వల్ జమాత్ జామియా మసీదులో ప్రత్యేక నమాజులు చేశారు. ఇమామ్ షేక్ గులామ్‌గౌసేరిజ్వి ఖురాన్ ప్రవచనాలు బోధించారు. మానవాళికి మార్గదర్శకత్వం వహించేందుకు దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరన్నారు. బిక్కవోలు మదీనా మస్జీద్, పందలపాక బిలాల్ మస్జీద్, అహల్లె సున్నత్ వలె జమాతే జామియా మస్జీద్‌లో నమాజులు చేశారు. ఆనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

మసీదులో ప్రత్యేక నమాజులు

మధురపూడి: కోరుకొండ మసీదులో గురువారం బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు గురువు సయ్యద్ ఇస్మాయేలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మత పెద్దలు షేక్ సుభాన్, బాషా, మొహిద్దీన్, ఇర్ఫాన్, ఇబ్రహీం పాల్గొన్నారు.

మండల గృహసారథుల ఇన్‌చార్జుల నియామకం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ మండల గృహ సారథుల ఇన్‌చార్జులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లోని మండల ఇన్‌చార్జులు వీరే...

మండలం	ఇన్‌చార్జి
రాజానగరం	ఏవీవీఎస్ జగదీష్
కోరుకొండ	కె.జయకర్
సీతానగరం	చెరుకూరి వీఎస్‌రామకృష్ణరాజు
అనపర్తి	చిర్ల వీర రాఘవరెడ్డి
బిక్కవోలు	బొడ్డు ముత్యాల రావు
రంగంపేట	మేడిశెట్టి రవిశంకర్
పెదపూడి	కర్రి శ్రీవెంకటరెడ్డి
గోకవరం	దాసరి రమేష్

రోడ్డు భద్రతపై అవగాహన

కడియం: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని హైవే అధికారులు సూచించారు. మండలంలోని బుర్రిలంక వద్ద గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనం వెనుక రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సూచికలను అనుసరించి వాహనం నడపాలన్నారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు


గోకవరంలో శాకంబరి అలంకారంలో దర్శనమిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

గోకవరం: స్థానిక బత్తులవారి వీధిలో వేంచేసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గురువారం శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో సుందరంగా అలంకరించారు. ఉదయం ఆలయ అర్చకుడు గణపతిశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు దేవీచౌక్ కనకదుర్గమ్మకు శాకంబరి అలంకారం

గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సుమారు 1000 కేజీల పండ్లు, కూరగాయలతో అమ్మవారిని అలంకరించనున్నట్టు ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ తెలిపారు.

ప్రతిపక్షాలతో అభివృద్ధికి అవరోధం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు జోగేశ్వరరావు

గోకవరం: గ్రామాభివృద్ధికి ప్రతిపక్షాలు అవరోధం కలిగిస్తున్నాయని కృష్ణునిపాలెం వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ భర్త రౌతు జోగేశ్వర రావు ఆరోపించారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి పలు చోట్ల మంచినీటి ట్యాంకులు, రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు నిధులు మంజూరైనప్పటికీ ప్రతిపక్షానికి చెందిన పలువురు వార్డు సభ్యులు సంబంధిత పనులకు ఆమోదం ఇవ్వకుండా అభివృద్ధికి అడ్డుపడ్డారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించడంతో పనులకు మోక్షం కలిగిందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు తుర్రం సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు అంబటి ప్రసన్న, ఇజ్జిన కిరణ్ పాల్గొన్నారు.

సాయిబాబా డ్వాక్రా సంఘానికి అవార్డు


రాజమహేంద్రవరంలో అవార్డు అందుకుంటున్న సాయిబాబా డ్వాక్రా గ్రూపు సభ్యులు

గోకవరం: స్థానిక సాయిబాబా డ్వాక్రా గ్రూపు ఇండియన్ బ్యాంకు జోనల్ పరిధిలో ఉత్తమ మహిళా సంఘంగా ఎన్నికైంది. ఇండియన్ బ్యాంకు రాజమహేంద్రవరం రీజినల్ పరిధిలోని 65 బ్రాంచిల్లో 2022–23 సంవత్సరానికి గాను ఉత్తమ గ్రూపుగా నిలిచింది. ఈ సందర్భంగా గురువారం రాజమహేంద్రవరంలోని ఇండియన్ బ్యాంకు జోనల్ కార్యాలయంలో యానిమేటర్ కలవల కనకరత్నం, గ్రూపు ప్రెసిడెంట్ కణితి వీరవెంకట అమరవాణి, సెక్రటరీ కణితి పావనలక్ష్మీగాయత్రి, ఇతర సంఘం సభ్యులకు బ్యాంకు రీజినల్ మేనేజర్ పీఎస్ఎస్ సుధాకర్ అవార్డు అందజేశారు. అవార్డు పొందిన సాయిబాబా డ్వాక్రా గ్రూపు సభ్యులను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

1 నుంచి జగనన్న సురక్ష సభలు

అనపర్తి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి జగనన్న సురక్ష సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి తెలిపారు. దీని నిర్వహణకు గాను మండల స్థాయి అధికారులను రెండు బృందాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎంపీడీఓతో పాటు డిప్యూటీ తహసీల్దార్ కె.శశిధర్, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ యు.రవితేజలు ఒక బృందంగా (టీం–1), తహసీల్దార్ వై.సరస్వతి, ఈవోపీఆర్డీ కేయూ ఆర్‌ఎల్ పద్మజ, ఆర్ఐ వై.దయామణి మరో బృందంగా (టీం–2) ఏర్పాటు చేశామని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సభలు నిర్వహిస్తారని తెలిపారు. వచ్చే నెల 1న అనపర్తి సచివాలయం–1 పరిధిలో టీమ్–1, మహేంద్రవాడ సచివాలయం–1 పరిధిలో టీమ్–2 పర్యటిస్తుందన్నారు. 4న అనపర్తి సచివాలయం–2, మహేంద్రవాడ సచివాలయం–2, జూలై 6న అనపర్తి సచివాలయం–3 (టీమ్–1), 11న అనపర్తి సచివాలయం–4, పొలమూరు సచివాలయం–1లలో, 13న అనపర్తి సచివాలయం–5, పొలమూరు సచివాలయం–2లలో, 14న దుప్పలపూడి సచివాలయం, పొలమూరు సచివాలయం–1లో, 18న పీరారామచంద్రపురం, రామవరం సచివాలయం–2లో, 20న కొప్పవరం, పెదపర్తి, 21న లక్ష్మీనరసాపురం(టీమ్–1), 25న కుతుకులూరు సచివాలయం–1, పులుగుర్త, 27న కుతుకులూరు సచివాలయం–2 (టీమ్–1) సభలు ఉంటాయన్నారు.

మహిళా సాధికారతతో దేశాభివృద్ధి



ప్రెసిడెంట్‌గా ఎన్నికైన విశాలాక్షికి సత్కారం

రాజమహేంద్రవరం సిటీ: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఇన్నర్ వీల్ క్లబ్ నూతన ప్రెసిడెంట్ ఎం.విశాలాక్షి అన్నారు. స్థానిక ప్రకాశం నగర్ లేడీస్ క్లబ్ ఆవరణలో గురువారం ఇన్నర్ వీల్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా విశాలాక్షి మాట్లాడుతూ సమాజంలో మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణిస్తూ, గౌరవాన్ని పొందేందుకు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. విద్యతో పాటు సాంకేతికతను ఉపయోగించుకుని అన్నిరంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. కార్యదర్శిగా ఆర్.లక్ష్మి, ఐఎస్ఓగా జి.సర్వలక్ష్మి, కోశాధికారిగా వి.అనంత, ఎడిటర్‌గా ఎం.తులసి ప్రమాణ స్వీకారం చేశారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకురాలు డాక్టర్ రాజశ్రీ, జాగృతి బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ మాధవి, లిటిల్ పేరడైజ్ అధినేత్రి బి.శ్రీదేవి, స్వీట్ మ్యాజిక్ రేణుక, న్యాయవాది రావిపాటి స్వర్ణలత తదితరులు నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.